# శ్రీపాదరేణువు

స్టేషను సందడిగా ఉంది.

మూడవ తరగతి ప్రయాణీకుల వెయిటింగు హాల్లో బెంచీలే కాదు, నేలకూడా ఖాళీగా లేదు. టిక్కెట్లిస్తున్న కిటికీ దగ్గర త్రొక్కిసలాడి పోతున్న జనం ఆ కిటికీ కాస్తా చేతుల్లోకి ఊడి వస్తే కానీ ఇవతలికి వచ్చేటట్లు లేరు.

'ఈరోజు టికెట్లు దొరకడంకూడా అనుమానమే' అన్నాడు సుందరం.

"స్టేషనులో అడుగుపెట్టావో లేదో, నీలోకి ప్రయాణీకుడి మనస్తత్వం వచ్చేసింది" అన్నాను.

'ప్రయాణీకుడి మనస్తత్వమంటే...' ఆశ్చర్యంగా నావైపుచూశాడు సుందరం.

'టికెట్టు దొరికేదాకా దొరకదేమోనన్న అనుమానం, అది దొరికిన తర్వాత రైలు సకాలంలో రాదేమోనన్న సందేహం. రైలుగూడా వచ్చిందిపో, కూచోడానికి తావుంటుందో ఉండదోనన్న ఆందోళన, తావు గూడా దొరికిందనుకుందాం. ఇతరులెవ్వరూ పెట్టెలోకి ఎక్కగూడదన్న స్వార్థం. మళ్ళీ ఇందులోనూ ఒక తమాషా, నువ్వు వాయల్‌పాడు దాకా వెళ్లాలనుకో, రైలంతవరకూ సురక్షితంగా వెళ్తే చాలుననుకుంటావు. ఆ తరువాత అది వెళ్ళినా, వెళ్ళకపోయినా మరేమై పోయినా నీకు దిగులుండదు...'

'సంతోషించాంలేవయ్యా సీతాపతీ! ప్రయాణీకుడి మనస్తత్వం తెలిసినంత మాత్రాన ప్రయాణం సుకరంగా గడచిపోతుందనుకోవద్దు. వీలయినంతలో ఇబ్బందుల్ని తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి...' అన్నాడు సుందరం.

ఎలా ప్రయత్నించాలో సెలవివ్వమన్నాను.

'ఇదిగో, ఇలాగే' అంటూ ఒక పది రూపాయల నోటును జేబులోనుంచి పైకి తీశాడు సుందరం.

"ఎందుకోయ్ సుందరం! ఆ డబ్బుతో నువ్వు రైలును కొనలేవు' అన్నాను.

'రైలు బండిని కొనలేకపోవచ్చు. కానీ సెకండు క్లాసు టికెట్లు కొనుక్కోగలను' ధీమాగా అన్నాడు సుందరం.

"ఎందుకు బాబూ వద్దు, ఎంచినట్టుగా ముప్పై మైళ్ళు. ఓ గంటసేపు ప్రయాణం. ఈ మాత్రానికి సెకండ్ క్లాసెందుకూ? నా మట్టుకు నాకు సెకండ్ క్లాసులో ప్రయాణం చేసే అవసరమెప్పుడూ కలగలేదు. గాంధీ మహాత్ముడు విధిగా మూడో తరగతి పెట్టెలో ప్రయాణం చేసేవాడట. నేనాయనకన్నా గొప్పవాణ్ణి కాను" అన్నాను.

'నీ బోడి ఆదర్శాలు నా దగ్గర వల్లించకు సీతాపతీ!" విసుక్కున్నాడు సుందరం. "నీకెందుకు? నువ్వూరుకో! టిక్కెట్లు కొనేవాణ్ణి నేను. నాకు లేని బాధ నీకేమొచ్చింది."

నిజానికి నాకు బాధగానే వుంది. రోడ్డుపైన నడుస్తూ నేను వీధి కిరువైపులా ఇంద్రభవనంలాంటి కట్టడాలనెన్నో చూచాను. అవి నావన్న అభిప్రాయం నాకు కలలోనైనా

కలగలేదు. సరిగ్గా అలాగే సెకండ్ క్లాసు రైలు పెట్టెనుగూడా ఎప్పుడైనా వెలుపలినుంచి చూచానేమో గానీ, లోపలికి వెళ్ళి దాన్ని నేనెన్నడూ పావనం చెయ్యలేదు. దినం మంచిదని పగలే దొంగతనానికి పూనుకున్నట్టుగా అవకాశం దొరికింది కదా అని ఈ రోజున నేను సెకండ్ క్లాసు పెట్టెలో జొరపడి ఇతరుల జాగాను దురాక్రమణ చెయ్యడం ఏం బాగుంటుంది? మూడో తరగతి ప్రయాణీకుల మధ్య కూచుంటే, నేను నా వాళ్ళలోనే ఉన్నట్టు నాకెంతో హాయిగా ఉంటుంది. పట్టాలు పుచ్చుకుని పెద్ద ఉద్యోగం చేస్తున్న కొడుకు దగ్గరికి వెళ్లి అతడు తమ దగ్గరకూడా గెజటడ్ ఆఫీసరు హోదా వెలగబెట్టేసరికి ఆశోపహతులై తిరిగి వచ్చే తల్లిదండ్రులు, పిండి వంటలతో నింపి, మూతికి పసుపు గుడ్డ బిగించిన కొత్త బిందెను ప్రక్కనుంచుకుని తీయటికోరికలతో కాపురానికి వెళ్తున్న కొత్త కోడలు, పంచాయితీ బోర్డు మెంబరుకు రాష్ట్ర రాజకీయాలు వివరిస్తున్న బడిపంతులు, కొంగులో కట్టుకున్న మూటను విప్పి ఏడుస్తున్న బిడ్డకు బఠాణీలు కొనిపెట్టే తల్లి, చిన్న సైజు భోజనం కారియర్లలో, పుస్తకాల సంచులతో జట్లుజట్లుగా పట్టణాలలోని హైస్కూళ్ళకో, కాలేజీలకో వెళ్ళే విద్యార్థులు – వీళ్ళందరూ ఎన్నో జన్మలనుంచీ పరిచితులై ఉన్న ఆత్మ బంధువుల్లా కనిపిస్తారు. వీళ్ళ సుఖదుఃఖాలు, కోపతాపాలు, రాగద్వేషాలు నాకు అరటిపండు ఒలిచి చేతపెట్టినంత సులభంగా అవగతమౌతాయి. నావేషం, నా భాష, నా సంస్కారం నిస్సంకోచంగా నిర్మొగమాటంగా నన్ను మూడో తరగతి పెట్టెలో కూచోడానికే అనుమతిస్తాయి. పోగా ఇందుకయ్యే ఖర్చును మిత్రుడొకడు భరిస్తున్నాడు. గనుక ఈరోజు నేను సెకండ్ క్లాసు పెట్టెలో ప్రయాణం చేస్తే చేయవచ్చు. కానీ ఎల్లకాలం నాకీ అవకాశం లభించగలదని గానీ ఎప్పటికీ నేనీ స్టేటస్‌నే మెయింటెయిన్ చేయగలననిగానీ పూచీ ఏమీ లేదు. ఎందుకొచ్చిన భోగం? ఈ ఒకరోజు భోగం నాకొద్దేవద్దు.

సుందరానికైనా ఈ సెకండ్ క్లాసు మోజు ఈ మధ్యనే అలవడినట్టుంది. వాడూ నేనూ బాల్య స్నేహితులం. ఫుట్‌బోర్డు పైన నిలబడి కమ్మీని పట్టుకుని వ్రేలాడుతూ ఎన్నో దఫాలు రైలు ప్రయాణం చేసిన వాళ్ళం. కానైతే ఇటీవల ఒక తమాషా జరిగిన మాట నేను కాదనలేను. హఠాత్తుగా మా సుందరం ఒక్కసారిగా ఓపినంత డబ్బు కళ్ళ జూచాడు. లాటరీలో కాదులెండి పిల్లనిచ్చిన మామగారు పాపం అల్లుడు గదా అని వాడికి కొంత పెద్ద మొత్తమే ముట్టజెప్పాడు. మంచిదే! అందువల్ల తనకు డబ్బు దుబారా చేసే హక్కు లభించిందని సుందరం భావిస్తున్నట్లయితే నాకేమీ అభ్యంతరం లేదు. నన్ను తన అడుగు జాడల్లో నడవమని నిర్బంధించకుండా వాడీ ముప్పయి మైళ్ల దూరం విమానంలో వెళ్ళినా నా కిష్టమే!

"చూడు సుందరం – నువ్వు మరేమీ అనుకోవద్దు. ఇందులో నీకంత పట్టింపుగా ఉన్నట్లయితే నువ్వు సెకండ్ క్లాసులోనే ప్రయాణం చెయ్యి. నేను నా మామూలు మేరకు నాకు తగ్గ క్లాసులోనే వస్తాను. ఇద్దరమూ తుమ్మల గుట్ట స్టేషన్లో దిగేద్దాము. అక్కడినుంచీ ఊరిలోకి ఉన్నదొక రోడ్డే. రైల్లో ఏ తరగతి పెట్టెలో ప్రయాణం చేసినా, ఆ రోడ్డుపైన మనం కలిసే నడిచి పోవచ్చు," అంటూ ఒక ఉపాయాంతరం కూడా సూచించాను.

సుందరం నావైపు చురచుర చూచాడు. నాది చాలా చచ్చు ఉపాయమన్నాడు. ఇక మారు మాట్లాడకుండా నోరు మూసుకోమన్నాడు. "జాస్తీ మాట్లాడితే ఫస్టుక్లాసు టికెట్టే కొనేద్దును. ఈ బండిలో ఫస్టుక్లాసు కంపార్టుమెంటు ఉండదు గనుక బ్రతికిపోయావు", పొమ్మన్నాడు.

నేనసలే మెతక వాణ్ణి. తెగేదాకా ఒక విషయాన్ని సాగదియ్యడం నాకట్టే ఇష్టం ఉండదు. అందువల్ల కిక్కురు మనకుండా వూరకుండిపోయాను.

నన్ను ప్లాట్‌ఫారంపైన నిలబెట్టి తాను నేరుగా బుకింగు ఆఫీసులోకి దూరి టికెట్లు పట్టుకొచ్చేశాడు సుందరం.

తనకు తానే బహుపరాక్ చెప్పుకున్నట్టుగా ఎక్కడో వస్తున్న రైలు కూతబెట్టింది.

ప్రయాణీకులు పెట్టెలు, సంచులు చేతిలోకి తీసుకుని, తోటివారిని విడవకుండా వెన్నంటి ఉండమని హెచ్చరికలు చెప్పుకుంటూ ఎవరి జాగ్రత్తలో వాళ్ళున్నారు. సుందరంలో అలాంటి తొట్రుబాటేమీ కనిపించడంలేదు. మీదు మిక్కిలి తదేక దృష్టితో ప్రయాణీకులవైపు చూస్తున్న అతని పెదవులపైన హేలగా ఓ చిరునవ్వు తాండవిస్తోంది. ఏ మాత్రపు చిరునవ్వైనా అందుకు కారణమంటూ ఒకటి ఉండాలి గదా! 'మీతో మాకేం పోటీ లెద్దురూ మీదారి మీది. మా దారి మాది' అన్న తూష్ణీ భావమే అందుకు కారణంగావచ్చు.

రైలు బుసలు పెట్టుకుంటూ స్టేషనులోకి వచ్చేసింది.

బాగా కష్టపడి పరీక్షలకు ప్రిపేరయిన తర్వాత చివరి క్షణంలో పరీక్షలు లేవు అందరూ పాసైనట్టేనని ప్రకటిస్తే ఎలాగుంటుంది, వచ్చిన రైలలాగే వచ్చింది. ఏవో నాలుగైదు తప్పితే మిగిలిన పెట్టెలన్నీ ఇంచుమించు ఖాళీగానే ఉన్నాయి.

కానీ ఎంత ఖాళీగా ఉన్నప్పటికీ, ఈ సందర్భంలో మూడో తరగతి పెట్టెవైపు తిరిగి చూడరాదన్న కఠోర నియమాన్ని నేను మరచిపోలేదు.

సుందరం పాదాలు అతనితో బాటుగా నన్నుకూడా సెకండ్ క్లాసు కంపార్టుమెంటు దగ్గరికే తీసుకెళ్ళాయి. "ఎక్కవోయ్ సీతాపతీ ఎక్కు" అంటూ సుందరం లోపలికి జారుకున్నాడు. నేనూ నీడలా అతణ్ణి వెంబడించాను.

ఆరోజు సెకండ్ క్లాసు పెట్టెలో ఒక్క బెంచీ అయినా ఖాళీగా లేదు.

ఎవరైనా దిగితే ఖాళీ ఏర్పడి తావు దొరకవచ్చునన్నమాట నేనొప్పుకుంటాను. కానీ దిగేటట్టయితే రైలు కదిలేలోగా దిగిపోవాలి కదా. అదేం జరగలేదు.

సుందరం తన చేతనున్న లెదర్ బ్యాగు తెరచి ఓ టవలు పైకి తీశాడు. రెండు బెంచీల నడుమనున్న ఖాళీ తావులో పరిచేశాడు. 'కూచో సీతాపతీ కూచో' అంటూ తాను ముందుగా కూచుని, రెసిస్ట్ చేసి నిలద్రొక్కుకోడానికి వీల్లేకుండా నన్నుకూడా దానిపైన కూలబడిపోయేటట్టుగా చేశాడు.

చుట్టూరా కలయ పరికించడానికే నాకు అలకువగా ఉంది. ప్రత్యేకించి వెనుకవైపు బెంచీలో ఎవరో ఆడవాళ్ళు కూచున్నారు. జరీ అంచు వచ్చిన సిల్కు చీరలు. తళుక్కు తళుక్కుమనే రాళ్ళ నెక్లెసులు, వంకీ ఉంగరాలు. ఎవరో గొప్పింటి జనానా అని చూడగానే తెలుసుకోవచ్చు.

ఆపాటికి సెకండ్ క్లాసు పెట్టెనంతా సర్వే చేసి ముగించినట్టున్నాడు సుందరం కొంగలా మెడ నావైపుకు సాచి మెల్లగా నా చెవిలో అన్నాడు – 'వెనుకవైపు బెంచీ పైన కూచున్నదెవరో ఎరుగుదువా సీతాపతీ?'

తెలియదన్నట్టుగా పెదవి విరిచాను.

'నీ ఇల్లు బంగారంగానూ! ఆవిడే తెలియదా నీకు; డిప్యూటీ కలెక్టరు వేణు మాధవనాయుడుగారి భార్యరా బాబూ!'

'ఊఁహూ. అలాగా!' అనుకున్నాను. నాకిప్పుడెంతో ఆనందంగా ఉంది. పరమానందంగా ఉంది. ఎందుకో చెప్పుకోగలరా? సెకెండ్ క్లాసు పెట్టెలో కూచోగలిగినందుకని మీరనుకుంటారు, అబ్బే, కానేకాదు. రెట్టింపు డబ్బు మనది కాదనుకుంటే ఇలాంటి పెట్టెల్లో ఎప్పుడైనా కూచోవచ్చు. డిప్యూటీ కలెక్టరు వేణుమాధవ నాయుడుగారి అర్ధాంగి పాద సన్నిధిలో కూర్చునే అవకాశం అందరికీ అన్ని సమయాల్లోనూ దొరికేదేనా? అది మాకు మాత్రమే లభించిన అరుదైన అవకాశం. ఎలాగైనా మేము ధన్యులం! మా జన్మ చరితార్థమై పోయింది.

♦ *జగతి మాసపత్రిక* – ***1966*** ♦